# అపోహ

- దూరి వెంకటరావు


‘‘ఇంకా ఇలాగే ఉన్నావటే..లేచి చీర మార్చుకో. అల్లుడు గారు నీ కోసం కాసుక్కూర్చున్నారు’’ జడలో మల్లెలు ముడుస్తూ తొందరపెట్టింది ప్రభావతమ్మ.

కీర్తిలో చలనం లేదు. సింగారించుకుందామన్న ధ్యాసేలేదు.తొలిరేయి తలపులతో మలిరేయి మధురానుభవం కోసం తపించి పోవలసిన ఆ నవ వధువు మనసు మౌనంగా ఉండడం వింతగా తోచిందామెకు.

‘‘చెప్తోంది నీకే.ముఖం కడుక్కుని కొత్త చీర కట్టుకో’’ స్వరం రెట్టించింది ప్రభావతమ్మ

‘‘తలనొప్పిగా ఉంది. విసిగించకు. నేను ఇవాళ ఇక్కడే పడుకుంటాను’’ ఖండితంగా చెప్పింది కీర్తి.

‘‘అదేంటే..తలనొప్పితే ఏదైనా మాత్ర వేస్కోవాలిగానీ గదిలోకెళ్లనంటావేంటి?’’ కూతురు మాటకు విస్తుపోతూ అంది ప్రభావతమ్మ.



మరి మాట్లాడకుండా మంచమెక్కి ముసుగు తన్నింది కీర్తి.

ఆమె ధోరణికి జగన్నాథం కూడా నివ్వెరపోయాడు. కూతురికి ఎలా చెప్పాలో తెలీక తిన్నగా అల్లుడి దగ్గరికెళ్లి...‘మరోలా అనుకోకు బాబూ! అమ్మాయికి వంట్లో బాగోలేదు.’’అంటూ సర్దిచెప్పాడు.

మతిపోయింది మనోజ్‌కి. ఉన్నట్లుండి కీర్తికేమైంది?.. నిన్న బాగానే ఉందే!..తలనొప్పి సాకుతో తన నుంచి తప్పించు కోవాలని చూస్తోందా? మరి పెళ్లెందుకు చేసుకుంది. కొంపదీసి లవ్ ఎఫైర్ ఏమైనా...ఆ ఊహకు ఒక్కసారిగా ఉక్కిరి బిక్కిరయ్యాడు. అలాంటిదేదైనా ఉంటే నిన్నరాత్రి తనతో సహకరించి ఉండేది కాదు కదా! ఆమె మాటల్లో గాని, చేష్టల్లో గాని ఎక్కడా అయిష్టత అనేది కానరాలేదు. మరెందుకీరోజు ఇలా ప్రవర్తిస్తోంది? తన గురించి ఎవరైనా ఏదైనా చెడుగా చెప్పారా? నిజంగా వంట్లో బాగో లేకపోతే ఆ సంగతి తనతో చెప్పొచ్చు. ముఖం చాటేయడం దేనికీ? సడన్‌గా గత రాత్రి అనుభవం కళ్లముందు మెదిలింది.

ముద్దమందారంలా ఎర్రగాబొద్దుగా ఉంటుంది కీర్తి. కళ్లు చెదిరే అందం ఆమె సొంతం. అట్టే చదూకోకపోయినా సంస్కారమున్న వ్యక్తి. నవనీతం వంటి మనసు ఆమెకున్న ఒకే ఒక ఆభరణం.


చేతులకి పాదాలకి తళుకులీనే మెహందీ సొగసులు, మెడలో పసిడి కాంతులు మించి మిలమిల మెరిసే పసుపుతాడు, ముద్దొస్తున్న ముఖారవిందంలో కలబోసుకుని అలముకున్న సిగ్గు దొంతరలతో మూర్తీభవించిన నవ వధువు. పాలగ్లాసుతో అడుగులో అడుగు వేస్తూ గదిలోకిచ్చింది.

గ్లాసు అందుకుని పక్కనపెట్టి మృదువుగా ఆమె భుజం మీద చెయ్యి వేశాడు మనోజ్.

మగడి స్పర్శకు పులకించిపోయిందామె తనువు. పయిట జారింది. ఆమె పరువం కనువిందు చేయడంతో నడుం చుట్టూ చేయివేసి ఆమె పెదాల్ని అందుకోబోయాడు.

సిగ్గుతో తల పక్కకు తిప్పింది. అయినా వదల్లేదు మనోజ్. కీర్తిని తన వైపుకు తిప్పుకుని ఆమె శరీరంలోని ప్రతి అణువుని మృదువుగా స్పృశించాడు.

మత్తుగా మూలుగుతూ రెప్పలు



వాల్చింది. ఒక్క ఉదుటున ఆమెను పాన్పు మీదకు నెట్టాడు. అయితే అసలు అనుభవంలోకి జారే ముందు ఆమె రవ్వంత అసంతృప్తికి లోనైనట్లు గ్రహించాడు. తన తొందరపాటు ఆమెను ఇబ్బంది పెట్టిందేమో అనుకున్నాడు.

మరునాడు కూడా ఆమె అనారోగ్యం నెపంతో గదిలోకి రాలేదు. వళ్లు మండింది మనోజ్‌కి. సర్రున గదిలో నుంచి బయటికొచ్చి...''నేను వెళుతున్నాను. మీ అమ్మాయి ఆరోగ్యం కుదుటపడ్డాక పంపించండి' అంటూ బ్యాగు అందుకున్నాడు.

అల్లుడికి కోపం వచ్చిందని గ్రహించినప్పటికీ నిస్సహాయులయ్యారు జగన్నాథం దంపతులు.

మనోజ్ భార్యను వదిలి వచ్చి వారం రోజులైంది. చూస్తుండగానే నెల తిరిగిపోయింది. అయినా అత్తవారింటి నుంచి ఏ కబురు లేదు. తొలిరేయి అనుభూతుల్ని నెమరేసుకుంటూ కాలం కరిగిస్తున్నాడు. పోనీ బెట్టు సడలించి అర్ధాంగిని తీసుకొద్దామన్నా కీర్తి ఏమంటుందోనన్న శంక ఓ మూల పీడిస్తోంది. ఇంతకీ ఆమె అయిష్టతకు కారణం ఏమిటో తెలియ రాలేదు. సమస్యకు మూలం కనుక్కుంటే తప్ప పరిష్కారం లభించదు. తన తరపున రాయబారం నడిపేందుకు నా అన్న వారెవ్వరూ లేరు. చిన్నప్పుడే తల్లిదండ్రులు గతించారు. కొంతకాలం వరకు తనను సాకిన మేనమామ ఇహ నా వల్ల కాదన్నట్లు విడిచిపెట్టేశాడు. ఏం చెయ్యాలో తెలీక తెలిసిన వాళ్ల ఇళ్లల్లో పనులు చేస్తూ వాళ్ల సహాయ సహకారాలతో చదూకుంటూ పెద్దవాడయ్యాడు. అదృష్టం బావుండి ఉద్యోగమొచ్చింది. ''నువ్వింకా ఒంటరిగా ఉండడం బాగోలేదం''టూ సంబంధ చూసి అతడిని ఓ ఇంటివాణ్ణి చేశాడు అతడితో సన్నిహితంగా మెలిగే మల్లేషు.

భార్యతో చెట్టాపట్టాలేసుకుని హుషారుగా షికార్లు చేయవలసిన మనోజ్ ఒంటరిగా ఉండడం గమనించి ఆశ్చర్య పోయాడు. కారణం అడిగితే ''ఇదంతా నీ చలవే. సంబంధం చూసిన వాడివి నీకు తెలీకుండా ఉంటుందా? నాతో వచ్చేందుకు ఆమె ఎందుకు విముఖత చూపుతోందో ఇప్పుడైనా చెప్పు నీకు పుణ్యముంటుంది'' అన్నాడు అభ్యర్థనగా.

''నాకు తెలిసి అమ్మాయి అందాల భరిణే కాదు.. గుణవంతురాలు కూడా... మరెందుకిలా ప్రవర్తిస్తోందో నాకర్థ కావడంలేదు. నేవెళ్లి కనుక్కుని రానా?'' అడిగాడు మల్లేషు.

''వద్దు. ఇక నీ సిఫార్సులేవీ నాకక్కర్లేదు. చేసిన ఉపకారానికి కోటి దండాలు. కచ్చితంగా పెళ్లికి ముందు కీర్తికి లవ్ ఎఫైర్ ఉండాలి. లేకపోతే ఆమెకు మొదటి రాత్రే మొగుడంటే ఎందుకు మొహం మొత్తుతుంది? అన్నీ తెలిసే కన్నవాళ్లు ఆమెను నాకంటగట్టారు. వారి ప్రయత్నానికి నీ వంతు సహకారాన్ని అందించావు. ఏ ఫలాపేక్షతో నువ్వందుకు పూనుకున్నావో నాకు తెలీడం లేదు'' అంటూ కోపంగా అక్కడి నుంచి వెళ్లిపోయాడు మనోజ్.

మిత్రుడికి మేలు చేయబోతే కీడు జరిగినందుకు బాధగా నిట్టూర్చాడు మల్లేషు.

కీర్తి భర్త వద్దకు వెళతాననదు. వెళ్లనూ అనదు. ఆ పిల్ల ధోరణేమీ అంతుపట్టడం లేదు జగన్నాథం దంపతులకి. అక్కడికీ ప్రభావతమ్మ కూతుర్ని దగ్గరకు తీసుకుని ఆమె అంతర్యాన్ని తెలుసుకునే ప్రయత్నం చేసింది. అయినా సాధ్యపడలేదు.

పెళ్లయిన పిల్ల నెలల తరబడి పుట్టింట్లో ఉంటే పది మంది ఏమనుకుంటారోనని భయపడ్డాడు జగన్నాథం. మొహం చెల్లక గడప దాటడం లేదు ప్రభావతమ్మ.

అనుకున్నట్లే..''కీర్తి కాపురానికి ఎందుకు వెళ్లలేదని అడిగింది పక్కింటి అమ్మాయి పద్మజ.

ఆ మాట ఇబ్బందిగా ఉన్నా తమాయించుకుంటూ ''కాపురానికి వెళ్లడానికి కీర్తి ఎందుకో తటపటాయిస్తోంది. ఆ పిల్ల మనసును మేమెవ్వరం పసికట్టలేకపోతున్నాం. నువ్వైనా దానికి కాస్త నచ్చచెబుదూ''బ్రతిమిలాడింది ప్రభావతమ్మ.

''మీరేం వర్రీ కాకండి ఆంటీ. నేను కనుక్కుంటాను'' అంది పద్మజ.

పద్మజ కీర్తి కంటే ఐదేళ్లు పెద్ద. అయినా ఆమెకింకా పెళ్లి కాలేదు. మొదటి నుంచి వాళ్లిద్దరూ ఎంతో క్లోజుగా ఉండడం వల్ల ఆ పిల్ల ముందైనా కూతురు నోరు విప్పుతుందేమోనని ప్రభావతమ్మ ఆశ.

ఆవిడ కోరిక మేరకు కీర్తి మనసు తెలుసుకునే ప్రయత్నం చేసింది పద్మజ. దాని మనసు ఎంత సున్నితమైందో ఆమెకు తెలుసు. అందుకే ఎంతో జాగ్రత్తగా విషయాన్ని డీల్ చేయాలనుకుంది. అయితే ఆమె ఏమడిగినా చకచకా జవాబు చెప్పే కీర్తి తన కాపురం విషయానికి వచ్చేసరికి మౌనం వహిస్తోంది.

''నా దగ్గర కూడా విషయాన్ని మభ్యపెడితే ఎలా? కోరి చేసుకున్నావు. మరెందుకు దూరంగా ఉండాలనుకుంటున్నావో నాకర్థం కావడం లేదు. కన్నవాళ్లతో చెప్పుకోలేనివేవైనా ఉంటే స్నేహితులతో చెప్పుకుని సాంత్వన పొందొచ్చు. అందుకే అడుగుతున్నాను నీ భర్త మీద నీకేమైనా అపోహలున్నాయా?'' క్లూ లాగేందుకు ప్రయత్నించింది పద్మజ.

ఆ మాటతో గళం విప్పింది కీర్తి. ''నేను కట్టుకున్న వ్యక్తి నాకు మాత్రమే స్వంతమవ్వాలి''

''అరె..కొంపదీసి మీ ఆయన మరెవరికైనా స్వంతమైపోయాడా ఏంటి?'' పద్మజ మాటల్లో ఎగతాళి ధ్వనించింది.

''అలా కచ్చితంగా చెప్పలేను. తొలి రోజున అతడి మూమెంట్స్ బట్టి అతనికి పూర్వానుభవం ఉన్నట్లు గ్రహించాను'' అంది కీర్తి.

''నువ్వేమైనా సైక్రియాటిస్టువా? సెక్స్ స్పెషలిస్టువా? చెప్పే మాటకి బేసుండాలి''

''ఆధారం ఉండబట్టే అనుమానించవలసి వస్తోంది''

''ఏవిటా ఆధారం?'' అడిగింది పద్మజ

''అతగాడికదే తొలి అనుభవమైతే తడుముకోకుండా తిన్నగా అతడి చేతులు వీపు వైపుకే ఎందుకు వెళతాయి? ఆడవాళ్లు బ్రాలకు హుక్స్ వెనుకవైపే ఉంటాయని అతడికి ముందే తెలుసన్నమాట.అంతే కాదు....శృంగారంలో పాల్గొనేటప్పుడు సయితం ఎంతో అనుభవం ఉన్నట్లే ప్రవర్తించాడు. వీటన్నిటిని బట్టి చూస్తే పెళ్లికి ముందే అతడికి పరస్త్రీ సాంగత్యం ఉందన్నది ఖాయం.

కీర్తి మాటలకు పకపక నవ్వింది పద్మజ.

''ఎందుకలా నవ్వుతావ్'' చిరాగ్గా అంది కీర్తి.

''నవ్వక ఏం చేయమంటావ్? నీ అమాయకత్వానికి నవ్వాలో ఏడవాలో తెలీడం లేదు. నువ్వింకా ఏ యుగంలో ఉన్నావ్? నేడు లైంగిక విషయాల్ని తెలియచెప్పే చిత్రాలెన్నో వస్తున్నాయి. వాటికి సంబంధించిన పుస్తకాలు కోకొల్లలు. అందుకు అనుభవమే అవసరం లేదు. యువతీ యువకుల సెక్స్ సందేహాల్ని నివృత్తి చేసేందుకు వీలుగా ఇవాళ దాదాపు అన్ని పత్రికలు డాక్టర్ సలహాల్ని, జవాబుల్ని ప్రచురిస్తున్నాయి. ఆ దిశగా ఈ రోజు యువకులు లైంగిక విషయాలపై అవగాహన ఏర్పరచుకుంటున్నారు. అంత మాత్రాన వాళ్లందరికీ పూర్వానుభవం ఉందనడం హాస్యాస్పదం''

''అంతేనంటావా?'' బేలగా అంది కీర్తి.

''ముమ్మాటికీ అంతే. లేనిపోని అపోహలతో పండంటి జీవితాన్ని పాడుచేసుకోకు. నీ తొలిరేయి తుదిరేయి కాకూడదు. మగడి మనసు ముక్కలు కాక ముందే అతడిని అల్లుకుపోడానికి ప్రయత్నించు. యిప్పుడు నువ్వు నాతో అన్నమాటే మీ ఆయనకు చెప్పు. నీ నిజాయతీకి మెచ్చుకుని నిన్ను అక్కున చేర్చుకుంటాడు. ఇకమీదట నీకు ప్రతిరేయి పున్నమి రేయే'' హెచ్చరికతో కూడిన సలహా ఇచ్చింది పద్మజ.

అంతే, మరి కిమ్మనకుండా భర్త చెంతకు పరుగు తీసింది కీర్తి.

*

రచయిత ఫోన్ నెం: **08922-233043**